ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 3 జూలై 2024

కొత్తపల్లె సమీపంలోని ప్రభుత్వ రేషన్ గోడౌన్ వద్ద పడవేసిన రాళ్లు



జనం సొమ్ము రాళ్ల పాలు

● కుప్పలుగా పడేసిన జగనన్న భూరక్ష సర్వే రాళ్లు

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం జనం సొమ్మును ఏ విధంగా దుర్వినియోగం చేసిందో తెలిపేందుకు ఈ రాళ్లే ప్రత్యక్ష ఉదాహరణ. జగన్ సీఎంగా ఉన్న సమయంలో 'వైఎస్సార్ జగనన్న భూ సంరక్ష' పథకం ప్రవేశపెట్టి భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారు. రీ సర్వే చేసి హద్దులు తెలిపేందుకు రాళ్లను పాతాలని నిర్ణయించారు. అయితే ఈ రాళ్లపై 'వైఎస్సార్ జగనన్న భూరక్ష 2020' అని చెక్కించారు. అప్పట్లో రీసర్వేపై రైతుల నుంచి ఎన్నో విమర్శలు వచ్చాయి. రీ సర్వేలో భూముల సరిహద్దు కొలతలు సక్రమంగా చేయడం లేదని రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ జగన్ ప్రభుత్వం అవేమి పట్టించుకోలేదు. కొంత మంది రైతుల పొలాల్లో భూసర్వే చేసి సరిహద్దు రాళ్లు నామ మాత్రంగా పాతారు. ప్రభుత్వం మారడంతో రీసర్వే ఆగిపోయింది. అయితే అప్పటికే ముద్దనూరు మండలంలో తెచ్చి పెట్టిన సర్వే హద్దు రాళ్లు ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ కుప్పలుగా పొలాల్లో, గుట్టల్లో దర్శనమిస్తున్నాయి. కొత్తపల్లె గ్రామ సమీపంలోని ప్రభుత్వ రేషన్ గోడౌన్ సమీపంలో, నల్లబల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక వైపు సరిహద్దు రాళ్లు కుప్పలుగా పడవేశారు. ప్రజలు రాళ్లను చూసి జగన్ ప్రభుత్వం జనం సొమ్మును దుర్వినియోగం చేసిందని గుసగుసలాడుతున్నారు.

\- ముద్దనూరు



నల్లబల్లె సచివాలయం వెనుక వైపు పడవేసిన రాళ్లు

పాలన గాడిన పడేనా..?

● అధికారుల్లో వైసీపీ వాసన పోని వైనం ● కీలక పోస్టుల్లో అంతా పాత అధికారులే

● ఇంకా కుర్చీ ఖాళీ చేయని డ్వామా పీడీ

● చంద్రబాబు 4.0 మార్కు పాలన రావాలంటే ప్రక్షాళన జరగాల్సిందే

టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు నెల అవుతున్నా ఇంకా పాలన గాడిలో పడలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లా అధికార యంత్రాంగం ఎంపీ అవినాశ్‌రెడ్డికి మోకరిల్లిందనే విమర్శ ఉంది. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ కుట్టదన్నట్టు.. ఎంపీ అవినాశ్‌రెడ్డి సిఫారసు, ఫోన్ కాల్ లేకుండా పనులే జరగవనే చర్చ అధికార, వైసీపీ వర్గాల్లో ఉండేది. ఇప్పుడు కూడా జిల్లా అధికార యంత్రాంగంపై పులివెందుల ప్రభావం బాగా ఉన్నట్లు అర్థమవుతోంది. ఇంకా కొందరు అధికారులు జగన్ పాలన ఉందన్న భ్రమలో ఉంటూ అలాగే కాలం గడుపుతున్నారన్న విమర్శ ఉంది.

(కడప-ఆంధ్రజ్యోతి): మళ్లీ 1995 నాటి పాలన నాలో చూస్తారు. 4.0 పాలన మొదలవుతుంది అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం పింఛన్ల పంపిణీ సందర్భంగా అన్నారు. 1995లో చంద్రబాబునాయుడు సీఎం అయిన తరువాత పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. క్షేత్రస్థాయి పర్యటనలు, ఆకస్మిక తనిఖీలతో పాలనను పరుగులు పెట్టించేవారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో గాడి తప్పిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు చంద్రబాబు 4.0 పాలన చూస్తారని చెప్పుకొచ్చారు. అయితే చంద్రబాబు మార్కు పాలన సాగాలంటే జిల్లాలో అధికార యంత్రాంగంలో ప్రక్షాళన జరగాల్సి ఉంది. ఇంకా జిల్లాలోని కీలకశాఖలలో పాత అధికారులే పాతుకుపోయారు.

డ్వామాలో పులివెందుల పవర్

డ్వామా పీడీగా పనిచేస్తున్న యదుభూషణరెడ్డి వైఎస్ కుటుంబానికి భక్తుడనే పేరుంది. ఈయన రెండేళ్ల క్రితమే పదవీ విరమణ చేశారు. అయితే ఎంపీ అవినాశ్‌తో ఉన్న అటాచ్‌మెంటుతో మళ్లీ రెండేళ్లు పొడిగించుకున్నారు. ఆ టైం అయిపోవడంతో మళ్లీ రెండు సంవత్సరాలు పొడిగించుకున్నారు. డ్వామా కార్యాలయాన్ని వైసీపీకి కేరాఫ్‌గా మార్చారనే విమర్శ ఉంది. పులివెందుల సిఫారసు లేఖలతో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటరు ఆపరేటర్లుగా సుమారు 25 మంది వైసీపీ వారిని నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. రిటైర్ అయినా మళ్లీ అదే పోస్టులో కొనసాగుతున్న అధికారులను ఇటీవలే చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది. అయితే యదుభూషణరెడ్డి మాత్రం ఇంకా రోజూ విధులకు హాజరవుతున్నారు. అలాగే డ్వామాలోనే విజిలెన్స్ అధికారిగా యోగాంజనేయరెడ్డి కూడా రిటైర్ అయ్యారు. ప్రభుత్వం తొలగించినా వీరిద్దరు ఇంకా విధులకు హాజరవుతుండడం, సిబ్బందితో యథావిధిగా మీటింగులు పెట్టుకోవడం చేస్తున్నారు. మూడురోజుల క్రితం ఏపీడీలను కూడా బదిలీ చేయడం గమనార్హం. టీడీపీ ప్రభుత్వం వచ్చినా డ్వామాలో ఇంకా పులివెందుల పవర్‌కే ప్రాధాన్యం ఇస్తుండడాన్ని చూసి సిబ్బందే ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

● గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనలో జిల్లా పరిషత్ కీలకం. దీని పరిధిలోని పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, ఇతరత్రా వాటిని చేపడతారు. జిల్లా పరిషత్ పాలకవర్గం వైసీపీ చేతల్లో ఉంది. అయితే జిల్లాపరిషత్‌లో సిబ్బంది కూడా కొందరు ప్రభుత్వ ఉద్యోగులని మరిచిపోయి వైసీపీకి బానిసలుగా మారిపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ వివిధ శాఖల్లో పనిచేసేవారు చాలా ఏళ్లుగా పాతుకుపోయారు. వదల బొమ్మాళీ వదల అన్నట్లుగా జడ్పీని వీడకుండా అక్కడే పనిచేస్తూ వైసీపీకి గులాం చేస్తున్నారు.

● జిల్లా పంచాయతీ కార్యాలయంలో కూడా ఇంకా వైసీపీ భక్తులే ఉన్నారంటారు. సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను వైసీపీకి వేయించేలా ఓ అధికారి వ్యవహరించారనే విమర్శ ఉంది. ఒకప్పుడు ఆయనకు మంచి పేరు ఉన్నప్పటికీ వైసీపీ పాలనలో మాత్రం వన్‌సైడ్‌గా మారారంటారు. పంచాయతీల్లో అవకతవకలు జరిగినా కూడా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నారన్న విమర్శ ఉంది.



పడకేసిన వైద్యం

జిల్లాలో వైద్యశాఖ నిర్లిప్తతగా ఉంది. కీలక అధికారే వైసీపీతో అంటకాగారనే విమర్శలు ఉన్నాయి. ఇక రిమ్స్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కీలక అధికారులు పులివెందుల పవర్‌కు ప్రాధాన్యతనిస్తారు. ఇక్కడ సేవల్లో వేగవంతం లేదు. ఇక నీటిపారుదల శాఖలో కీలక అధికారే నిర్లిప్తంగా ఉన్నారు. ఎస్ఈ శ్రీనివాసులు పనితీరుపై విమర్శలున్నాయి.

పోలీసుశాఖ

వైసీపీ పాలనలో అంతా ఐపీసీ సెక్షన్ బదులు వైపీసీ సెక్షన్ అమలు చేశారనే విమర్శ ఉంది. జిల్లాలో పెద్ద ఎత్తున భూకబ్జాలకు పోలీసులే పంచాయితీ చేశారనే ఆరోపణలు న్నాయి. కడపలో అయితే గంజాయి గుప్పుమంటుంది. గంజాయి మత్తులో ఎవరు ఏం చేస్తున్నారనేది అర్థం కాని పరిసితుల్లో ఉన్నారు. దీంతో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. ఇంకా గంజాయి బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకోలేదు. రౌడీబ్యాచ్‌లు కూడా వీధికొకటి ఉన్నాయి. కడప డీఎస్పీ వైసీపీకి అనుకూలంగా ఉంటారనే ఆరోపణలున్నాయి. ఇలా కీలకశాఖలన్నీ ఇంకా పాలనగాడిన పడలేదు. వీటిలో ప్రక్షాళన జరిగితే తప్ప చంద్రబాబు మార్కు 4.0 పాలన సాధ్యం కాదని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

పాఠశాలల్లో ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ రామరాజు

కడప(కలెక్టరేట్), జూలై 2: జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థల్లో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్‌తో కలసి సంక్షేమ వసతి గృహాల అధికారులు, ఎంఈఓలు, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి పారుదల అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాజీపేట బాలికల హాస్టల్‌లో తాగు నీరు కలుషితమవడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవడం పట్ల ఆయన ఆగ్రహించారు. ఈ విషయంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లో, విద్యాశాఖాధికారులు మూడు రోజుల పాటు వాటర్ ట్యాంకులు, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్య పరిక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎంఈఓలు, పాఠశాలల్లో భోజన నిర్వహణను పరిశీలించాలన్నారు. ప్రతి రెండువారాలకు ఒకసారి నీటి ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి కొరత లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. వంట నిర్వహణలో వర్కర్లకు శిక్షణ, పారిశుధ్యంపై చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలన్నారు. పిల్లల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారం అందివ్వాలన్నారు. డయేరియా, కలరా లాంటి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య భద్రత, పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది ప్రతి గ్రామంలో అన్ని గృహాల్లో కుళాయిల నీటి సదుపాయం పరిశీలించి, నీటిని పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ అనురాధ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, సంక్షేమ శాఖల అధికారులు, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు, తదితర అధికారులు పాల్గొన్నారు.

దేవుడి సాక్షిగా లంచం తీసుకోం

● ఉద్యోగులతో ప్రమాణం చేయించిన వరద



లంచం తీసుకోనని సబ్‌రిజిస్ట్రార్‌తో దేవునిపై ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 2: దేవుడి సాక్షిగా మేము లంచం తీసుకోం అంటూ ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉద్యోగులు ప్రమాణం చేశారు. మంగళవారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వెళ్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అవినీతి నిలయంగా మార్చితే ఊరుకోనన్నారు. మీరు చేసే ప్రతి అవినీతి పని తన దృష్టికి వస్తోందన్నారు. ఇక్కడ తన మనుషులతో నిఘా పెట్టానన్నారు. అవినీతి మానకుంటే ఏసీబీకి పట్టిస్తానన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు అవినీతికి పాల్పడమని దేవుని పటం మీద ప్రమాణం చేయాలని ఆదేశించారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ రత్నమ్మతో సహా ఉద్యోగులు ప్రమాణం చేశారు. స్టాంప్ రైటర్ల అక్రమాలు తన దృష్టిలో ఉన్నాయన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని ఏదైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుంటామని సబ్ రిజిస్ట్రార్ తెలిపారు.

కడప కలెక్టర్‌గా లోతేటి శివశంకర్



కడప,జూలై2 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కలెక్టరుగా లోతేటి శివశంకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు కలెక్టరుగా ఉన్న విజయ రామరాజును బదిలీ చేసింది. 2021 జూలైలో కలెక్టరుగా విజయరామరాజు బాధ్యతలు చేపట్టారు. దాదాపు మూడేళ్లపాటు విధులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ల బదిలీ జరగడంతో ఆయనను బదిలీ చేశారు. ఇక కడప కలెక్టరుగా లోతేటి శివశంకర్‌ను నియమించారు. ఈయన 2013 బ్యాచ్ చెందిన ఐఏఎస్ అధికారి. పల్నాడు జిల్లా కలెక్టరుగా ఈ ఏడాది మే 18 వరకు పనిచేశారు. పోలింగ్ రోజున మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఈవీయంను ధ్వంసం చేశాడు. ఇది దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఇష్యూను సీరియస్‌గా తీసుకుంది. ఈవీయంల విధ్వంసం వీడియో తెరపైకి రావడంతో మే 18న శివశంకర్‌ను కలెక్టరుగా తప్పించింది. అప్పటి నుంచి వెయిటింగ్‌లో ఉన్న ఆయనను కడప జిల్లా కలెక్టరుగా నియమించింది.

ప్రైవేటు విద్యాసంస్థలో.. పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలు



పెచ్చులూడిన గదిని పరిశీలిస్తున్న పోలీసులు

కడప(ఎడ్యుకేషన్), జూలై 2: కడప నగరం అక్కాయపల్లెలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో మంగళవారం పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలయ్యాయి. ఒకరికి తీవ్ర గాయం కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. విద్యాసంస్థ పైఅంతస్తు 8వ తరగతి గదిలో పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పడింది. దీంతో అక్కడున్న ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పిల్లలను వెంటనే పాఠశాల యాజమాన్యం తిరుమల హాస్పిటల్‌కు తరలించింది. కాగా.. ఈ ఘటనకు ప్రధానకారకులు కడప మున్సిపల్ కార్పొరేషన్, విద్యాశాఖ అధికారులే అని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందన్నారు. ప్రస్తుతం ప్రమాదం జరిగిన విద్యా సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిందని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జూన్ 20న కమిషనర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై కార్పొరేషన్ అధికారుల నుంచి స్పందన లేదన్నారు. కార్పొరేషన్ అధికారులు విచారణ చేసి ఉంటే ఈ రోజు పిల్లలకు ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. అలాగే ఇదే విద్యాసంస్థపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. వారూ స్పందించలేదన్నారు. పెచ్చులూడి పడ్డ విషయంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లానని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు. కాగా.. పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలవడం బాధాకరమని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై జిల్లా విద్యాశాఖ స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై ఆర్డీవో, కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి విచారణ ప్రారంభించారు. సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తాలూకా పోలీసుస్టేషన్‌లో డీవైఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



ఆ పాఠశాలపై తాను జూన్ 20న ఫిర్యాదు చేశానని చెబుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

విద్యాసంస్థ ఎదుట ఆందోళన

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం విద్యాసంస్థ ఎదుట ఆందోళన నిర్వహించారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కబ్జాదారుల్లో 'సిట్' దడ

● బద్వేలులో ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో వేల ఎకరాలు

● కబ్జా భూముల స్వాధీనానికి అప్పట్లో లోకేశ్ హామీ


● ప్రభుత్వం మారడంతో కబ్జాదారుల్లో వణుకు

వైసీపీ హయాంలో ఐదేళ్లుగా జిల్లాలో ఎక్కడా లేనంతగా బద్వేలులో భూ ఆక్రమణలు యథేచ్ఛగా సాగాయి. ఒకే స్థలాన్ని ఇద్దరు ముగ్గురికి కూడా అమ్మేశారు. ప్రైవేటు స్థలాలకు సైతం దొంగ డాక్యుమెంట్లు సృష్టించి స్వాధీనం చేసుకున్నారు. ప్రశ్నించిన వానిఇ బెదిరించారు. ఒలా ఒక్క బద్వేలు పట్టణంలో దాదాపు వేయి స్థలాలకు పైగా క్రయవిక్రయాలు చేశారని సమాచారం. వీటన్నింటిపై పలుమార్లు బాధితులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన పోలీస్, రెవెన్యూ అధికారులు అప్పట్లో కొందరిని అరెస్టు చేశారు. అనంతరం వైసీపీ పెద్దల జోక్యంతో ఈ కేసు మరుగున పడిపోయింది. ఇళ్ల స్థలాలే కాదు.. నియోజకవర్గం వ్యాప్తంగా వేల ఎకరాల ప్రభుత్వ భూములు వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. వీటన్నింటిపై తాము అధికారంలోకి రాగానే 'సిట్'తో దర్యాప్తు చేయిస్తామంటూ యువ గళం పాదయాత్రలో నారా లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. నారా లోకేశ్ మంత్రి అయ్యారు. దీంతో బద్వేలులోని కబ్జాదారుల్లో 'సిట్' దడ పట్టుకుంది.

బద్వేలు, జూలై 2: ప్రభుత్వం మనదే అడిగేవారెవరు అంటూ వైసీపీ హయాంలో భూ దందాలు, ఆక్రమణలకు పాల్పడ్డ వారు ఇప్పుడు సిట్‌తో దర్యాప్తు జరుగుతుందేమోనని భయపడుతున్నారు. జిల్లాలోనే బద్వేలు పట్టణంలో స్థలాలతో పాటు ఈ నియోజకవర్గంలో వేల ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. భూములతో పాటు బద్వేలు, పోరుమామిళ్ల పట్టణాలలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నారు. కబ్జాలతో కోట్ల రూపాయలు కూడబెట్టుకున్న వారికి ఇప్పుడు ప్రభుత్వం మారడంతో వణుకు పుడుతోంది.

వేల ఎకరాలు అన్యాక్రాంతం

బద్వేలు నియోజకవర్గంలో వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. అనధికార అంచనా ప్రకారం నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల ఎకరాల ఆక్రమణ జరిగినట్లు తెలుస్తోంది. భూములతో పాటు బద్వేలు, పోరుమామిళ్ల పట్టణాలలో ఇళ్ల స్థలాల పేరిట విక్రయించేందుకు కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారు. బద్వేలులో జరిగిన ఆక్రమణలపై అనేకసార్లు విచారణ చేపట్టినప్పటికీ అవి మధ్యలోనే ఆగిపోవడం, రాజకీయ ఒత్తిడులకు అధికారులు గురికావడంతో కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగింది. బద్వేలులో భూ ఆక్రమణలపై ఆర్డీవో గతంలో కన్నెర్ర చేసినా అది కొంతకాలమే. ఎక్కువశాతం బద్వేలు, కలసపాడు, కాశినాయన, గోపవరం మండలాలలో భూ ఆక్రమణలు జరిగాయి. ఈ ఆక్రమణల్లో వైసీపీకి చెందిన చోటా మోటా నాయకులతో పాటు పెద్ద పెద్ద నాయకులు కూడా కొందరు ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆక్రమణలకు సంబంధించిన జాబితా రెవెన్యూ అధికారుల వద్ద ఉన్నట్లు సమాచారం. అయినా వైసీపీ అధికారంలో ఉండడంతో ఇంతకాలం వారిని ఏమీ చేయలేకపోయారు. ఇప్పుడు ప్రభుత్వం మారడం, ఇందుకు తోడు సిట్‌తో విచారణ జరిపిస్తామని గతంలో లోకేశ్ చెప్పడంతో.. ఇదే జరిగితే వేల ఎకరాల భూములు ప్రభుత్వ స్వాధీనం అయ్యే అవకాశం ఉంది. దీంతో కబ్జారాయుళ్లు వాటిని ఎలా కాపాడుకోవాలోనన్న ఆందోళనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.





బద్వేలులో భూకబ్జాలకు పాల్పడిన వారి నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాలు, సీళ్లు (ఫైల్‌ఫొటో)

భూ దందాలు జరిగిన ప్రాంతాలు

రాష్ట్రంలో ఎక్కడా లేనంతగా భూ దందాలు బద్వేలు నియోజకవర్గంలో జరిగాయి. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు ఇష్టానుసారంగా విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారు. బద్వేలు, పోరుమామిళ్ల, రంగసముద్రం, రామిరెడ్డి కుంట, కలసపాడు, రామాపురం, శంఖవరం, మామిళ్లపల్లి, మాదిగ ఇనాం భూములు వైసీపీ నేతల గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. సి.కొత్తపల్లిలో సర్వే నెంబరు 55/1, 2లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కంచె వేశారు. ఎన్‌జీవో కాలనీలో వైసీపీకి చెందిన నేత కోట్ల విలువ చేసే స్థలాలను ఆక్రమించుకుని తమ గుప్పిట్లో ఉంచుకున్నారు. గోపవరం మండలం, 111 సర్వేనెంబరులో ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. ఇలా నియోజకవర్గంలోని పలు మండలాలలో విలువైన ప్రభుత్వ భూములు వైసీపీ నేతల కబంధ హస్తాలలో ఉన్నాయి. వైసీపీ నేతలు చేసిన భూ దందాలు వెలికి తీసేందుకు టీడీపీ నేతలు, అధికారులు దృష్టి సారించడంతో భూ కబ్జాదారులలో వణుకు పుడుతోంది. బద్వేలులో భూ ఆక్రమణలపై సిట్‌ను నియమిస్తారంటూ ప్రచారం సాగుతుండడం సంచలనంగా మారింది.

ప్రక్షాళన ఎప్పుడో..?



- వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ నాన్ టీచింగ్ పోస్టులనియామకాల్లో గోల్‌మాల్
- రూ.8లక్షల నుంచి రూ.10 లక్షలకు అమ్ముకున్న వైనం
- వైసీపీ అనుయాయులకే పెద్దపీట

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో యోగివేమన, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలలో అక్రమాలు జరిగాయనే విమర్శలున్నాయి. ముఖ్యంగా ఈ రెండు చోట్ల నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవి వైసీపీ అనుయాయులకు, అనుచరులకు పునరావాస కేంద్రాలుగా మారాయనే విమర్శ ఉంది. ఇక్కడ కొన్ని పోస్టులు ఏకంగా అమ్ముకున్నారంటూ వైసీపీ నేతలే విమర్శించారు. యూనివర్శిటీ పోస్టులలో తమకు ప్రాధాన్యత లేకుండా ఒక్కో ఉద్యోగాన్ని 8 నుంచి 10 లక్షల రూపాలయకు అమ్ముకున్నారంటూ ఎన్నికల్లో ఓటమి తరువాత కడప అసెంబ్లీపై సమీక్ష సందర్భంగా పలువురు కార్పొరేటర్లు ఎంపీ అవినాశ్ వద్ద వాపోయారు. దీనిని బట్టి చూస్తే నాన్ టీచింగ్ పోస్టుల నియామకాల్లో ఎంత అక్రమాలు జరిగాయో అర్థమవుతుంది. వైవీయూ, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీల్లో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలంటూ విద్యార్థి సంఘాలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అక్రమాల గుట్టు రట్టు చేయాలంటూ విద్యార్థి సంఘాల నేతలు పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదేళ్లపాలనలో వైవీయూలో చోటు చేసుకున్న అక్రమ నియామకాలు, ఇతరత్రా వాటిపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది.

వివాదాలకు కేంద్రాలు

ఒకప్పుడు విశ్వవిద్యాలయాల్లో స్టూడెంట్స్ యూనియన్లకు ప్రాధాన్యం ఉండేది. యూనియన్ల మధ్య ఎన్నికలు జరిగేవి. అప్పట్లో ప్రభుత్వాలు యూనియన్లతో ఎంత అవసరమో అంతమేరకే జోక్యం చేసుకునేవి. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక ఆ సంప్రదాయాలన్నీ మారిపోయాయి. యూనివర్శిటీల్లోకి రాజకీయాలు ఎంట్రీ ఇచ్చాయి. ఇక పోటీ పడి మరీ భజన చేసే బ్యాచ్ కూడా యూనివర్శిటీలో తిష్ట వేసింది. వెరసి ఎక్కడా లేని విధంగా అక్కడ అధికార యంత్రాంగం వైసీపీకి దాసోహం అయినట్లు విమర్శలున్నాయి. యోగివేమన, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాలను వైసీపీ పునరావాస కేంద్రాలుగా మార్చారనే విమర్శలున్నాయి. జిల్లాలో ఇప్పటిదాకా వైవీయూ, ఆర్కిటెక్చర్, రిమ్స్ అంటే ఇవన్నీ వైఎస్ కుటుంబానికి ఆస్తులు అని వైసీపీ నేతలు భావిస్తుంటారు. అక్కడ వారికి అనుకూలురను నియమించుకుని అలాగే నియామకాలు చేపట్టారనే విమర్శలున్నాయి.

- వైవీయూలో జగన్ జమానాలో సుమారు వంద మందికి పైగా బోధనేతర సిబ్బందిని ఇష్టారాజ్యంగా నియమించారనే విమర్శలున్నాయి. కొన్ని ఉద్యోగాలు పులివెందుల సిఫారసులతో సృష్టించి నియమించగా మరికొన్ని ఉద్యోగాలను కడప నేతలు ఒక్కో పోస్టును పదిలక్షలకు అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేకుండా అవసరానికి మించి నాన్ టీచింగ్ స్టాఫ్ అయిన స్వీపర్స్ డ్రైవర్స్ ఇతర ఉద్యోగాల్లో తమవారిని నియమించి వైసీపీ పునరావాస కేంద్రంగా మార్చారనే విమర్శ ఉంది. ఇక కీలక అధికారులే వైసీపీకి భజన చేస్తుండడంతో ఇక్కడ నియామకాలు రెండో కంటికి తెలియకుండా జరిగాయంటారు.
- ఇక వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో కూడా అడ్డగోలుగా నియామకాలు చేశారంటారు. ఇక్కడ కూడా భారీ సంఖ్యలో చేపట్టారనే విమర్శ ఉంది. ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఈసీ సురేంద్రనాథరెడ్డి, వైవీయూ వీసీలుగా పనిచేసిన సుధాకర్, సూర్యకుమారిల అక్రమాలపై సీబీడీ విచారణ చేయించాలంటూ పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం అడ్డగోలు నియామకాలు, నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చదువులకు పెద్దపీట వేయాల్సిన విశ్వవిద్యాలయాల్లో వైసీపీ పాలిటిక్స్‌కు ప్రయార్టీ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

రెండో రోజు కొనసాగిన సర్టిఫికెట్ వెరిఫికేషన్



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు టౌన్, జూలై 2: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 2వ రోజు కొనసాగింది. మంగళవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో సైనిక సంతతికి చెందిన విద్యార్థులు 62 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 113 మంది మొత్తం 175 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు అయ్యారు. అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్.అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, బుధవారం సైనిక సంతతికి చెందిన విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికార వర్గాలు తెలిపాయి.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 2: వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొఫెసరు తుమ్మలకుంట శివప్రతాప్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఏపీ మైన్స్‌అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంటు, రాయల్టీఇన్‌స్ట్రక్టర్ జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఈనెల 10లోపు విద్యార్థులు తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ...ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారు

చెన్నూరు, జూలై 2: మండలంలోని పాత టోల్‌గేటు వద్ద సోమవారం రాత్రి ఓ ఆటోను లారీ ఢీకొనడంతో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నూరు వాసి తాజుద్దీన్ కుటుంబం కొన్నేళ్లుగా కడపలో ఉంటోంది. సోమవారం చెన్నూరులోని వారి ఇంట్లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి రాత్రి ఆటోలో వెళుతుండగా పాత టోల్‌గేటు వద్ద వెనుక వైపు నంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న షమీఉన్నీసా (40), ఆయేషా (35), తహరున్నీసా (37), చిన్నారులు ముస్తాన్ (13), ఖవ్వాజ్ (10), మెహర్ (7)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రిమ్స్‌కు తరలించగా.. స్థానికులు కడపలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఫవాజ్, మెహర్ పరిస్థితి విషమంగా ఉంది. కాగా సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నెలలో ఇది నాలుగో ప్రమాదం

పాత టోల్‌గేటు వద్ద గతంలో ఉన్న లైట్లు, డివైడర్లను తొలగించారు. దీంతో రోడ్లు వెడల్పు ఎక్కువగా ఉండడంతో వాహనాలు అతి వేగంతో దూసుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు ఎటు వైపు వెళుతున్నారో అర్థం కాని పరిస్థితుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంతో కలిసి కేవలం 20 రోజుల్లోనే నాలుగు ప్రమాదాలు జరిగాయి. 20 రోజుల కిందట ఓ మహిళ, ఆమె మరిది కొడుకు మృతి చెందారు. ఆ తరువాత ఐదురోజులకు ఓ లారీ డ్రైవరు మృతి చెందగా, ఆ వెంటనే మరో ప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇక్కడ ఏ క్షణం ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని పలువురు వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు హైవే అధికారులు కానీ, రోడ్డు రవాణా ఉన్నతాధికారులు కానీ తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై ప్రతి ఒక్కరూ మండిపడుతున్నారు.

యువతి ఆత్మహత్య

పెండ్లిమర్రి, జూలై 2: మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెదిన బత్తల వెంకటలక్ష్మి (24) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. వెల్లటూరు గ్రామ పంచాయతీలోని పెద్దదాసరిపల్లె చెరువులో రేగుచెట్టుకు ఓ యువతి ఉరి వేసుకొని మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ హరిప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించారు. రెండు వారాల కిందట ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. రిమ్స్ డాక్టర్లు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీ.. సైకిలిస్టు మృతి

కడప (క్రైం), జూలై 2: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో వేగంగా వచ్చిన కారు సైకిలిస్టును ఢీకొనడంతో ఎల్లంపల్లె పరశురాం బర్నీబాస్ (68) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కడప మరియాపురానికి చెందిన బర్నీబాస్ మంగళవారం సైకిలుపై బిల్టప్ సైడ్ వెళుతుండగా తెలుగుగంగ వైపు నుంచి కడపకు వస్తున్న కారు సైకిలును ఢీకొంది. ఈ ప్రమాదంలో సైకిలిస్టుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసినట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్



రామాపురం, జూలై 2: మండలంలోని రాచపల్లి పంచాయతీ మంగళపల్లె వద్ద మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రామాపురం ఎస్ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లపై చర్యలు చేపట్టాలి

- అఖిల పక్ష నేతలు డిమాండ్



వినూత్న రీతిలో అవినీతి అధికారులకు పాలాభిషేకం చేస్తున్న అఖిలపక్ష నేతలు, ప్రజా సంఘాలు

కడప(కలెక్టరేట్), జూలై 2: జిల్లాలో భూ కుంభకోణాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు తోడ్పాటునందించిన జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అవినీతి అధికారులైన జిల్లా రిజిస్ట్రార్ పీఎన్ బాబు, సబ్ రిజిస్ట్రార్ సుందరేశన్‌పై చర్యలు తీసుకోవాలని నిరసిస్తూ వారి ఫొటోలకు పాలభిషేకం చేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నేత ఆంజనేయులు మాట్లాడుతూ వంకలు, వాగులు, తెలుగు గంగ భూములు, రైల్వే భూములను వదలకుండా అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయడం వెనక జిల్లా రిజిస్టర్ పాత్ర ఉందన్నారు. ఇలాంటి భూములను రిజిస్టర్ చేస్తే వచ్చే కమీషన్‌లో 60:40 వాటాలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారని ఆరోపించారు. స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్ణ నాగయ్య భూము లను మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అనుచరులు కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయాలపై గతంలో ఉన్న కలెక్టర్, ప్రస్తుత కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు. సాక్షాత్తు డిప్యూటీ మేయిర్ పోలీసుల భూములను లాగేసుకున్నా పట్టించుకునేవారే లేరన్నారు. ఈ నెలాఖరున ప్రజా సంఘాలు, పార్టీలతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి కబ్జా భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగించే వరకు పోరాడతామని హెచ్చ రించారు. గతంలో నారా లోకేశ్‌బాబు భూకుంభ కోణాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిగా ఆ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన రిజిస్ట్రేషన్ల అక్రమాలపై సబ్‌రిజిస్ట్రార్ సుందరేశన్‌పై రిపోర్టులు రాసినా వారిపై చర్యలు తీసుకోవాల్సిన కలెక్టర్ ఉదాసీనంగా వ్యవహరిం చడం దారుణమన్నారు. తక్షణం బుగ్గవంక భూములు 42 ఎక రాలు, రైల్వే, వంకలు, వాగులు ఆక్రమణలను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయ కులు అవ్వారు మల్లికార్జున, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అవినీతిపై ఓపెన్ ఫోరంలో అధికారుల నిలదీత



ఉపాధిలో అక్రమాలపై అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

సికెదిన్నె, జూలై 2: సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధి అవినీతిపై అధికారులను ప్రజలు నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంతో పేదలకు పని కల్పించి వారి కుటుంబానికి ఉపాధి కల్పిస్తోంది. అయితే కొందరు ఉపాధి హామీ సిబ్బంది ఉపాధి నిధులను అక్రమ మార్గంలో పొందేందుకు పనికి రానివారికి సైతం జాబ్‌కార్డులు సృష్టించి పని కల్పించినట్లు రికార్డులో చూపి ఆ నిధులు కూడా కాజేస్తున్న ఘనులు మండలంలో అనేక మంది ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని ఓ చిన్న పంచాయతీలోని చిన్నగ్రామంలో సర్పంచ్, కుటుంబ సభ్యులు అతని అనుచరుల కుటుంబ సభ్యుల పేరుతో ఏడాదిలోనే దాదాపు రూ.6 లక్షలు నిధులు కాజేసినట్లు మంగళవారం జరిగిన ఓపెన్ ఫోరంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 23 మంది పేర్లతో అవినీతి చేసినట్లు తెలుస్తోంది. ఐదేళ్లగా ఇదేతంతు నడుస్తున్నట్లు గ్రామస్తులు అధికారులకు తెలిపారు. మైక్రో ఏటీఎం ద్వారా బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్లు ఉపాధి కూలీలు నిరక్షరాస్యులను ఆసరాగా చేసుకుని స్మార్ట్‌ఫోన్ లేనివారిని ఎంచుకుని వారికి తక్కువ కూలి వచ్చిందని తెలిపి దాదాపు ఒక్కొక్కరి నుంచి 8 నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్లు ఆరోపించారు. ఈ విషయం కాస్త ఉపాధి కూలీలకు తెలియడంతో తమ డబ్బు కొట్టేస్తారని లబోదిబోమంటున్నట్లు తెలుస్తోంది. గతంలో ఉండే ఓ పెద్ద పంచాయతీలో పనిచేసే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అన్నీ తానై అధికారులందరినీ బెదిరిస్తూ ఉపాధిలో తను చెప్పిందే వేదంగా నడిపిస్తుండేవాడని వివరించారు. ప్రభుత్వం మారడంతో అన్ని పంచాయతీల్లోని ఉపాధి అవినీతిని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో అంతా బట్టబయలైంది. దీంతో అధికారులు విచారించి రికవరీ చేయడం, వారిని తొలగిస్తామని తెలపడంతో ప్రజలు శాంతించారు. కార్యక్రమంలో అడిషనల్ డ్వామా పీడీ నాగరత్నమ్మ, డీఆర్‌డీప ఏపీఓ ప్రసాద్‌రావు, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ షకీలాబేగం, ఏపీఓ రామాంజులరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి భాస్కర్, కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థపై ప్రతికూల ప్రభావం

- బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప

కడప(రూరల్) జూలై 2: భారతదేశంలో కొత్త క్రిమినల్ చట్టాల అమలు న్యాయ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉందని కడప బార్‌అసోసియేషన్ అధ్య క్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల అమలును వ్యతిరేకిస్తూ మంగళవారం కడప బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాల స్థానంలో తీసుకొచ్చిన మూడు కొత్త చట్టాలు పౌరుల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నేర న్యాయచట్టం వలన పోలీస్‌కు అత్యధిక ప్రాధాన్యత కల్పించి.. పౌరుల ప్రాథమిక హక్కులను హరించేలా ఉందన్నారు. దీంతో పోలీస్ రాజ్యాంగం ఏర్పడే అవకాశం ఉందని తీవ్రమైన అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ చట్టాల వలన బాధితులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఇదివరకు జ్యుడీషియల్ కస్టడీ 14 రోజుల వరకు ఉండేదని.. కొత్త చట్టాల వలన 60 రోజుల నుంచి 90 రోజులు ఇవ్వడంతో సుదీర్ఘ కాలం జైల్లో ఉండాల్సి వస్తుందన్నారు. కొత్త చట్టాలకు హిందీ పేర్లు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కొత్త చట్టాల్లోని ఇబ్బందికరమైన అంశా లను మార్పుచేసి పౌరుల ప్రాథమిక హక్కులకు భంగంలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ నేతలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పొల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అనేక సేవలు



వన్‌స్టాప్ సెంటర్‌లో రిజిష్టర్లను పరిశీలిస్తున్న జడ్జి

కడప(రూరల్) జూలై 2: ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్‌సెంటర్ ఆపన్న హస్తమని.. ఇక్కడ ఒకేచోట అనేక సేవలు అందుతాయని డీఎల్ ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబాఫృద్దీన్ పేర్కొన్నారు. కడప నగరం రిమ్స్ ఆవరణలోని వన్‌స్టాప్‌సెంటర్‌ను మంగళవారం జడ్జి విజిట్ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించారు. అక్కడ లభిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాఫ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌స్టాఫ్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, తదితర సేవలు లభిస్తున్నాయన్నారు. వన్‌స్టాఫ్ సెంటర్ ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఫోర్స్ బస్సులు



తేజోమూర్తికి బస్సు కీస్ అందజేస్తున్న శ్రీ దుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్

రేణిగుంట, జూలై 2: తిరుపతి- రేణిగుంట రోడ్డులోని శ్రీ దుర్గా ఫోర్స్ షోరూమ్‌లో మంగళవారం ఫోర్స్ స్కూల్ బస్సులను మార్కెట్లోకి విడుదల చేశారు. వీటిని చిత్తూరుకు చెందిన విజయం గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత తేజోమూర్తి మొదట కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా ఫోర్స్ అధినేత మంచి శివప్రసాద్, ఫోర్స్ ఏరియా సేల్స్ మేనేజర్ కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ ఫోర్స్ మోటార్స్ నుంచి 55 సీట్ల కెపాసిటీతో స్కూల్ బస్సులను విడుదల చేశామన్నారు. మోనోకోక్ బాడీతో ఉన్నతమైన పారాబోలిక్ సస్పెన్షన్‌తో ప్యాసింజర్లకు కారులో తిరిగే అనుభూతితో మంచి మైలేజి కలిగి ఉండటం ఈ బస్సుల ప్రత్యేకత అని చెప్పారు.

5 నుంచి 11 వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

కడప(ఎడ్యుకేషన్), జూలై 2: విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 5 నుంచి 11వతేదీ వరకు రద్దయినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఎ.జనార్దన్ తెలిపారు. విశాఖపట్టణం నుంచి కడప మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488) ఈ నెల 5 నుంచి 10 వరకు, అలాగే కడప నుంచి విశాఖ మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ 6 నుంచి 11 వరకు రద్దయిందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని కోరారు.

రీసర్వేతో రైతులకు తిప్పలు

- 1బీలో కనిపించని భూవిస్తీర్ణం
- రైతులకు చుక్కలు చూపిస్తున్న అధికారులు



మా భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని చూపుతున్న రైతులు

చక్రాయపేట, జూలై 2: గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కారణంగా రైతులకు తిప్పలు తప్పడం లేదు. రీసర్వే కారణంగా 1బిలో భూవిస్తీర్ణం కనిపించకపోవడంతో రుణాల రెన్యువల్స్ నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఎవరి భూములు ఉన్నాయో, ఎవరి భూములు లేవో తెలియడం లేదు. ఓ వైపు సకా లంలో రెన్యువల్స్ చేయకుంటే రాయితీలు రావని బ్యాంకులు అంటున్నారు. దీంతో రైతులు సచివాలయాలకు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గండి కొవ్వూరు, చక్రాయపేట, మారెళ్లమడక, అద్దాలమర్రి, కుమార్లకాల్వ, నెర్సుపల్లె, మహేశ్వరపల్లె, కె.రాజుపల్లె, గొట్లమిట్ల గ్రామాల్లో రీసర్వే జరిగింది. కానీ ఎరబొమ్మనపల్లె, సురభి, కుప్పం, ఎర్రగుడి, చిలేకాంపల్లె, కల్లూరుపల్లె గ్రామాల్లో రీసర్వే జరగలేదు. రీసర్వే జరగని గ్రామాల్లో రైతులకు ఎలాంటి సమస్య లేదు. 1బీ, అడంగల్ అన్నీ వస్తున్నాయి. కానీ రీసర్వే జరిగిన గ్రామాల్లో మాత్రం అడంగల్, 1బీలు రాకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అధికారులు మాత్రం మా సమస్యను పట్టించుకోకుండా చుక్కలు చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరి భూములు ఒకరికి, తొమ్మిది ఎకరాలు ఉన్న రైతుకు కేవలం ఒకటిన్నర ఎకరా ఆన్‌లైన్‌లో కనిపి స్తోంది. మరికొందరికి పదెకరాలు ఉంటే 9.10 ఎకరాలు చూపిస్తోంది. యార్ల వాండ్లపల్లెకు చెందిన చెన్నయ్య అనే రైతుకు 2.39ఎకరాల భూమి ఉండగా కేవలం 2.01 సెంటు కనిపిస్తోంది. గంగయ్యకు 1.60ఎకరాలు ఉంటే కేవలం 0.60 సెంట్లు చూపిస్తోంది. బాలయ్యకు ఎకరా భూమి ఉంటే 9.10ఎకరాలు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. ఇలా రైతులకు సంబంధించి భూములు తారుమారు అయిపోయాయి. దీనికి తోడు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం ఇటీవల రీసర్వే రద్దుచేసినా.. జీఓ రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మ్యుటేషన్ చేసుకోవాలన్నా, పాస్‌బుక్కులు రావాలన్నా, పేర్లు మార్చాలన్నా, వెబ్‌సైట్ ఓపెన్ అయ్యే వరకు రైతుకు కష్టాలే. గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ రాజసింహనరేంద్ర భారీగా అవకతవకలకు పాల్పడి ఒకరి భూములు ఒకరికి ఎక్కించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి త్వరగా వెబ్‌సైట్ ఓపెన్ చేయించి తమ భూములు తమకు దక్కేలు చూడాలని రైతులు కోరుతున్నారు.

యాప్‌పై అవగాహన కల్పించండి

విద్యుత్ ఏడీఈ జయసుధాకర్‌రెడ్డి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏడీఈ జయసుధాకర్‌రెడ్డి

సింహాద్రిపురం, జూలై 2: విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులకు డిస్కం, మొబైల్ యాప్‌పై అవగాహన కల్పించాలని పులివెందుల రూరల్ ఏడీఈ జయసుధాకర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన మాట్లాడుతూ గతంలో లాగా విద్యుత్ వినియోగదారులకు గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా బిల్లులు చెల్లించే అవకాశం ప్రస్తుతం లేదన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రంలో బిల్లులు చెల్లించని వారికి డిస్కం, మొబైల్ యాప్‌పై అవగాహన అవసరమన్నారు. విద్యుత్ బిల్లుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఏడీఈ సిబ్బందిని హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో వుండాలన్నారు. 5వ తేదీన పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో పులివెందుల మినీసెక్రటేరియట్‌లో జరిగే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని వినియోగదారులు వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఏడీఈ తెలిపారు. మండల విద్యుత్ ఏఈ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను రాజకీయాలతో ముడిపెట్టొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కేసీ బాదుల్లా

వేంపల్లె, జూలై 2: గత ప్రభుత్వం మాదిరి కక్ష సాధింపు ధోరణి ఉండదు అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు కిందిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని కార్మికులను రాజకీయాలతో ముడిపెట్టొద్దని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా విజ్ఞప్తి చేశారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ మండలి బోర్డును పునరుద్ధరిస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాటలను స్వాగతిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ స్కీమ్‌లలో పనిచేస్తున్న చిరుకార్మికులను మీరు మానుకోండి మా వాళ్లను నియమించుకుంటామని అర్ధాంతరంగా తొలగించాలనే ఆలోచనలు మానుకోవాలని హితవుపలికారు. ఏ ప్రభుత్వం వచ్చినా కార్మిక హక్కులను కాయలరాయడమే పనిగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా నేతలు మద్దిలేటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అండతో పెట్రేగిన మట్కా బీటర్లు



పులివెందుల టౌన్, జూలై 2: వైసీపీ నేతల అండదండలతో మట్కాను విచ్చలవిడిగా నిర్వహించేవారు. సులభంగా డబ్బు సపాదించాలనే ఆశను అవకాశంగా తీసుకుని కొందరు మట్కా మహమ్మారిని తెచ్చి విస్తృతంగా వ్యాప్తి చేశారు. వృద్ధులు, యువకులు, మహిళలు సైతం మట్కా ఉచ్చులో ఇరుక్కుని విలవిల్లాడుతున్నారు. ఎన్నో కుటుంబాలు అప్పులపాలై వారికున్న ఇళ్లను కూడా అమ్ముకున్న పరిస్థితి ఉంది. పులివెందులలో నాటి వైసీపీ నేతల అండతో బీటర్లు విచ్చలవిడిగా బహిరంగంగానే మట్కా నిర్వహించారు. అదుపు చేయాల్సిన పోలీసు అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో మునుగుతూ మట్కా నిర్వాహకులకు తమవంతు సాయం అందించారు. ముఖ్యంగా రోజువారి కూలీలే ఎక్కువ మంది మట్కాకు బానిసయ్యారు. గత ప్రభుత్వంలో మట్కా దర్జాగా నిర్వహిస్తూ రోజూ ప్రతి వైసీపీ కార్యక్రమానికి స్వామిభక్తిగా పోస్టర్లను ఏర్పాటు చేస్తూ రావడం గమనార్హం. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా మట్కా మహమ్మారికి బ్రేకులు పడేనా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలీసులకు సహకరిస్తాం : బీటెక్ రవి

పులివెందుల పరిధిలో ఎవరైనా మట్కా రాసినా, సహకరించినా ఉపేక్షించేది లేదని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి హెచ్చరించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు కాని మట్కా పాల్పడినట్లు తెలిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామన్నారు. ఈ విషయంలో పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించేలా టీడీపీ సహకరిస్తుందన్నారు. మట్కా నిర్వాహకులపై నిఘా ఉంచడం, సహకరించే వారిని వదిలిపెట్టవద్దని పోలీసు శాఖకు ఆయన సూచించారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థల గుర్తింపు రద్దుచేయాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నేతలు

కడప (ఎడ్యుకేషన్), జూలై 2: జిల్లాలో నిబంధనలు పాటించని విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. కార్యాలయంలో డీఈఓ అనురాధకు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ పాఠశాల పేర్లతో టెస్టు బుక్కులు, నోటు బుక్కులు, మెటీరియల్స్ ముద్రించి మార్కెట్ ధరలకంటే మూడు రెట్లు అధికంగా నిర్ణయించి అమ్ముతున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే డీఈఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి కుటుంబీకులు

వీరపునాయునిపల్లె, జూలై 2: ఎన్.పాలగిరి జడ్పీ హైస్కూల్లో గతేడాది టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. అదే గ్రామస్థుడు శ్రీకాంత్‌రెడ్డి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ పెద్దలు గోర్ల రెడ్డిసుబ్బారెడ్డి, తిరుపాలమ్మ జ్ఞాపకార్థం మొదటి, రెండు, మూడు బహుమతులుగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందించారు. ఆయన అన్న నాగశేఖర్‌రెడ్డి, వదిన సీతారెడ్డి ద్వారా అందించారు. మిగిలిన 1200 మంది విద్యార్థులకు డిక్షనరీలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగిరెడ్డి, జి.సుబ్బరామిరెడ్డి, మధు, చెన్నకేశవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలి

కడప (ఎడ్యుకేషన్), జూలై 2: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రభుత్వం విద్యారంగం తీవ్ర నిరక్ష్యానికి గురైందని, విద్యారంగం పట్ల అవలంభించిన తీరుతో సంక్షోభం నెలకొందన్నారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ ఉపాధ్యాయులు సహకారం అందించా రన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రవికుమార్, సుజాతారాణి, నరసింహారావు, రమణ, శ్రీనివాసులు, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్,రూతు ఆరోగ్యమేరీ పాల్గొన్నారు.

'హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి'

కడప (మారుతీనగర్) జూలై 2: హిందువులు హింసను ప్రేరేపిస్తారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు యావత్ భారతదేశంలోని హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయని వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బి.పవన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. ఇలాంటి వ్యాఖ్యలు మరో సారి పునరావృతం కాకుండా తక్షణమే క్షమాపణ చెప్పితీరాన్నారు. లేని పక్షంలో యావత్ హిందూ సమాజం చైతన్యవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీపీ చలపతి, నాయకులు శ్రీరంగప్రసాద్, రామకృష్ణారెడ్డి, ప్రవీణ్‌నాయుడు, అమర్‌నాథ్‌రెడ్డి, ఆంజనేయులు తోపాటుపలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి దేశవ్యాప్త బంద్ జయప్రదం చేయాలి

విద్యార్థి సంఘాల పిలుపు



వైవీయూ రిజిస్ట్రారు రఘునాథరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

కడప (ఎడ్యుకేషన్), జూలై 2: దేశవ్యాప్తంగా 4న చేపట్టిబోయే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం వైవీయూలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు రఘునాథరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన గుజ్జల వలరాజు, సునీల్ మాట్లాడుతూ కేంద్ర తన వైఖరిని స్పష్టంగా తెలుపుతూ ప్రాథమిక విద్య మొదలుకుని ఉన్నత విద్యారంగ విలువలకు ఉరితాళ్లు బిగుస్తోందన్నారు. ఫలితంగా మాస్టార్ల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసేలా ఎంట్రెన్స్‌లు ఆయాశాఖల్లో పెడుతూ ఉన్నత ప్రమాణాల నాణ్యతను విద్యార్థుల ప్రతిభను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని తెలిపారు. మరికొన్ని సమస్యలపై దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని, విద్యాసంస్థలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు రాహుల్, శివశంకర్, ఆనంద్, మస్తాన్, అశోక్, సల్మాన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



వేంపల్లెలో మొక్కలు నాటుతున్న గాలి హరిప్రసాద్

వేంపల్లె, జూలై 2: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గాలి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం వేంపల్లెలో అమ్మపేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. అవి భావితరాలకు బాసటగా నిలుస్తాయన్నారు. పార్లమెంటులో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ హిందువులను ఉద్దేశించి మాట్లాడిన మాటలు శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, చరణ్‌రాయల్, నారాయణ, నాగపవన్ తదితరులు పాల్గొన్నారు.

6న కడప వీపీసీలో ఉచితంగా రేబిస్ టీకాలు

కడప(రూరల్) జూలై 2: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జూలై 6న శనివారం కడప నగరంలోని బహుళార్థక పశువైద్యశాల(వీపీసీ)లో పెంపుడు కుక్కలకు పిచ్చి రాకుండా ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నట్లు ఉపసంచాలకులు డాక్టర్ కె.రంగస్వామి తెలిపారు. కుక్కలకు రేబిస్ వచ్చిన తరువాత వైద్యం లేదనందున పెంపుడు కుక్కల యజమానులు ముందుగానే కుక్కలకు టీకాలు వేయించుకుని పెంపుడు జంతువులను కాపాడుకోవాలన్నారు.

కడపలో ఆక్రమణల కూల్చివేత

కడప (కల్చరల్), జూలై 2: హైకోర్టు ఉత్తర్వుల మేరకు కడప పాతబస్టాండు వద్ద గల యాదాళ్ల పిచ్చయ్య చెట్టి చారిటీస్ అసోసియేషన్ ఆక్రమణలను దేవదాయశాఖ జిల్లా అధికారి ఎస్.శంకర బాలాజీ ఆధ్వర్యంలో కూల్చివేశారు. నాగరాజుపల్లి వద్ద గల సర్వే నెం.5లో గల 20 సెంట్లు ఆక్రమణకు గురైన స్థలంలో కట్టిన సీపీఐ(ఎం) ఆఫీసును కూల్చివేశారు. సదరు ఆక్రమణ స్థలాన్ని దేవదాయశాఖ స్వాధీన పరుచుకున్నట్లు ఆయన వెల్లడించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 2: జిల్లా అభివృద్ధిని విస్మరించి విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు యాదవ్, ఏఐఈఎస్ఏఓస్ జిల్లా అధ్యక్షుడు జగన్నాయక్, పీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఎస్ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జీఆర్ఎస్‌వూఎఫ్ జిల్లా అధ్యక్షులు రెడ్డిసాయి బంద్‌కు పిలుపునిచ్చారు.

దోమల నివారణకు ఏసీఎం పిచికారీ

పులివెందుల రూరల్, జూలై 2: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మంగళవారం దోమల నివారణకు ఆల్ఫాసైపర్ మిత్రిన్ పిచికారీ చేసినట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు ఏసీఎం పిచికారీ చేశామన్నారు. ఒకసారి పిచికారీ చేస్తే 10 నుంచి 12 వారాల వరకు ఉంటుందని ఆ ప్రదేశంలో దోమ వాలితే నిమిషాల్లో చనిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డన్ నరసింహులుపాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల రూరల్, జూలై 2: చైతులు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. స్టాప్‌డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్, ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. వంటగదులను, నీటి ట్యాంకులను, మరుగుదొడ్లను, పరిసరాలను పరిశీలించారు. డయేరియాపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజెప్పాలని ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్జేడీ అవినీతిపై చర్యలకు జాప్యం ఎందుకు?'

కడప (ఎడ్యుకేషన్), జూలై 2: కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డి కడప డీఈఓగా ఉన్న సమయంలో అనేక అవినీతి ఆరోపణలపై విచారణ చేసేందుకు జాప్యం ఎందుకని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్రసహాయ కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి సునీల్ ప్రశ్నించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు విలేక రులతో మాట్లాడుతూ రాఘవరెడ్డి డీఈఓగా ఉన్న కాలంలో వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గతంలో ఎస్ఎఫ్ఐ ఆందోళనలు చేసిన విషయం గుర్తు చేశారు. ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థం కావడంలేదన్నారు. కనీసం ప్రస్తుత ప్రభుత్వమైనా విచారణ జరిపిచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెండో అధికార భాష ఉర్దూకు అవమానం

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 2: ఏపీలో రెండో అధికార భాష ఉర్దూ అమలులో ఉన్నా ప్రభుత్వం ఉర్దూ పాఠ్య పుస్తకాలు అందించకపోవడం బాధాకరమని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మగ్బుల్‌బాషా అన్నారు. మంగళవారం ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పులతో విద్యారంగంపై ఈ ప్రభుత్వం చొరవ చూపకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ జోక్యం చేసుకుని ఉర్దూ పుస్తకాలను సరఫరా చేయించాలని ఆయన కోరారు.

తాగునీటి విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి



చెన్నూరులో హెచ్ఎంలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రాజగోపాల్

చెన్నూరు, జూలై 2: విద్యార్థులకు పాఠశాలలో అందించే తాగునీటి విషయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఓ రాజగోపాల్ అన్నారు. మండల విద్యా కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన మాట్లాడాతూ ఏఏ పాఠశాలల్లో ఆర్వోప్లాంట్లు ఉన్నాయి, కుళాయి నీరు ఎన్ని పాఠశాలల్లో విద్యార్థులు తాగుతున్నారు. నీరు వచ్చే ప్రాంతాలు ఎలా ఉన్నాయి. ట్యాంకులున్న పాఠశాలలు ఎన్ని, వాటిని శుభ్రం చేస్తున్నారా లేదా వంటి వాటిపై హెచ్ఎం ప్రశ్నించారు. ప్రతి నెలలో 2, 4 శుక్రవారాలు నీటి ట్యాంకులు శుభ్రం చేయాలని, నీటిలో క్లోరినేషన్ తప్పనిసరన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి విద్యార్థికీ తాగునీరు అందించేటప్పుడు ఒకటికి పదిమార్లు ఆ నీటిని చూడాలన్నారు. మూతల్లేని ఇంటెక్స్ ట్యాంకులున్నా వాటిని వాడరాదన్నారు. అవసరమైతే పాఠశాలలకు నీరందించే నీటిని పరీక్షించాలని సూచించారు. పరిసరాల శుభ్రత చాలా ముఖ్యమని, వాటి వల్ల ప్రస్తుత సీజన్‌లో రోగాలు దరి చేరకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగిరెడ్డి, ఎంఈఓ-2 సునీత, హెచ్ఎంలు పద్మనాభయ్య, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఇళ్లవద్దే పింఛన్ల పంపిణీ హర్షణీయం

కాంగ్రెస్ నేత తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 2: ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం 65.31లక్షల మందికి రూ.4408కోట్లు సామాజిక పింఛన్ జూలై 1న లబ్ధిదారుల ఇళ్లవద్దే సచివాలయ సిబ్బంది ద్వారాపంపిణీ చేయడం హర్షణీయమని మాజీ రాజ్యసభ సభ్యులు,కాంగ్రెస్ సీనియర్ నేత నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

వారసత్వరాజకీయాలకు చోటులేదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి



పార్టీలో చేరిన వారితో జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్ రెడ్డి

కడప (మారుతీనగర్) జూలై 2: ఇతర పార్టీల్లా తండ్రి తర్వాత(కొడుకులు, అళ్ళుల్లు) వారసత్వరాజకీయాలకు భారతీయ జనతాపార్టీలో చోటులేదని పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ పురోగతి కోసం శ్రమించిన సామాన్య కార్యకర్తలకు సైతం ఉన్నత పదవులు దక్కుతాయన్నారు. ఆ కోవలో దేశ ప్రధాని నరేంద్రమోదీ సైతం కింది స్థాయి కార్యకర్త నుంచి దేశ ప్రధానిగా మూడో సారి యావత్ భారతదేశ ప్రజల ఆదరాభిమానాలతో ప్రజారంజక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. నగర 2వ డివిజన్ బీజేపీ నేత బి. ఆంజనేయులు (చిన్న) ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా కార్యకర్తలు కోఆపరేటివ్ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శశిభూషణ్ రెడ్డి ద్వారా పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనాథ్‌రెడ్డి, నేతలు శ్రీరంగప్రసాద్, అమర్‌నాథ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బి. పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, బీజేపీ నేతలు సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పలువురు ముస్లిం మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడిన నేత చంద్రబాబు

కడప (ఎడ్యుకేషన్), జూలై 2: ఇచ్చన మాటకు కట్టుబడిన నేత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అని టీడీపీ నేత డేవిడ్ పేర్కొన్నారు. ఎన్టీఆర్‌భరోసా 7వేలు జూలై 1న చెప్పిన మాట ప్రకారం పంపిణీ చేశారని తెలిపారు. ఒకేసారి వెయ్యి పెంచి రూ.4వేలు పెన్షన్ ఇవ్వడం సంతోషకరమన్నారు. మూడునెలల బకాయిలు రూ.3వేలు కలిపి అవ్వతాతలకు రూ.7వేలు ఇవ్వడం అభినందనీయమని ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు వడ్డెర్ల ఆత్మీయ సన్మాన సభ

కడప (మారుతీనగర్), జూలై 2: జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న గురువారం సాయంత్రం 4గంటలకు స్థానిక ఐఎంఏ హాలులో వడ్డెరుల ఆత్మీయ సన్మాన సభ జరగనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమణయ్య, నారాయణ తెలిపారు. ఆ ఆత్మీయ సభకు ముఖ్యఅతిథులుగా కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు, వడ్డెరలు హాజరు కావాలని కోరారు.





విజయదుర్గా అమ్మవారి ఆలయంలో రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ మళ్లీ పంపిణీ

చాపాడు, జూలై 2: మండలంలోని అన్నవరం, మడూరు, తప్పెట ఓబాయపల్లె గ్రామాల్లోని 94 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్ డబ్బులు మళ్లీ సోమవారం పంపిణీ చేసినట్లు ఆ గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు వారితో సొంత పూచీకత్తుపై సంతకం తీసుకున్నట్లు తెలిపారు. మళ్లీ విచారణ జరిపినప్పుడు లబ్ధిదారులకు సంబంధించి పింఛన్ మంజూరులో దొంగ సర్టిఫికెట్లు అని తేలితే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

'ఆర్‌జేడీ అవినీతి,అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

పోరుమామిళ్ల, జూలై 2 : ప్రస్తుత ఆర్‌జేడీ రాఘవరెడ్డి జిల్లా విద్యాశాఖాధికారిగా ఉన్న సమయంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై కలెక్టరు వేసిన విచారణ కమిటీ తమ నివేదికను ఎందుకు బహిర్గతం చేయలేదని అవినీతి అధికారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌జేడీ పై వచ్చిన ఆరోపణలపై డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌తో కలెక్టర్ విచారణ కమిటీని కలిసి వివరించడం జరిగిందన్నారు. అయితే అప్పట్లో వైసీపీ నాయకులు అండదండలు ఉండడంతో అధికారులు అతనిపై చర్యలు తీసుకోకపోగా ఆర్‌జేడీగా ప్రమోషన్ ఇచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వ మైనా అతని అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

4 ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

చాపాడు, జూలై 2: మండలంలోని నరహరిపురం గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లు, ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరుకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లకు ప్రొద్దుటూరు పట్టణంలోని ఎక్సైజ్ శాఖ అధికారులు రూ.32 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నాలుగు ఇసుక ట్రాక్టర్ల యజమానులు మంగళవారం పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా మైదుకూరుకు చెందిన ప్రత్యేక టీం పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్ పై రూ.8 వేలు చొప్పున జరిమానా విధించడం జరిగిందన్నారు.

పసుపుసాగులో రైతన్న బిజీబిజీ

చాపాడు, జూలై 2: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో మండలంలోని రైతులు పసుపు పంటను ముమ్మరంగా సాగు చేస్తున్నారు. సీతారామపురం, లక్ష్మీపేట, భద్రిపల్లె, చాపాడు, కేతవరం, చిన్నగురవలూరు, విశ్వనాథపురం తదితర గ్రామాల పరిధిలో పసుపు సాగు చేస్తున్నారు. విత్తనం పసుపు పుట్టి (250 కేజీలు) రూ.14 వేలకు మైదుకూరు, పోరుమామిళ్ళ ప్రాంతాల్లో కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. సుమారు 500 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. 45రోజుల క్రితం విత్తనం పసుపును కొనుగోలు చేసి చల్లని ప్రదేశాల్లో చెట్ల కింద కుప్పలుగా పోశారు. ఆ పసుపు ప్రస్తుతం మొలకెత్తింది. మహిళా కూలీలు ఆ పసుపును రెండు,మూడు ముక్కలుగా విరిచి సిద్ధం చేస్తున్నారు. ఇలాంటి ముక్కలుగా ఉన్న పసుపును రైతులు భూముల్లో విత్తుతున్నారు. ఎద్దులు దున్నుతుండగా మహిళా కూలీలు పసుపు సాళ్లల్లో ఒక పద్ధతి ప్రకారం సమాన దూరంలో ఉండే విధంగా వేస్తున్నారు. ప్రతి ఏడాది రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తారు. కేసీ కెనాల్, చాపాడు చానెళ్ల కింద వ్యవసాయ పిల్లర్ల కింద పంట సాగు చేస్తున్నారు.



ఎద్దులతో దున్నుతున్న దృశ్యం, పసుపు విరుస్తున్న మహిళలు

రేపు విద్యా సంస్థల బంద్‌కు పిలుపు

మైదుకూరు, జూలై 2 : కేంద్రం నిర్వహించే ప్రశ్న పత్రాలు లీక్ అయిన కారణంగా గురువారం విద్యా సంస్థలన్నింటికీ బంద్ ప్రకటించామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఐఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రతాప్ పేర్కొన్నారు. ఈ మేరక మంగళవారం స్థానికపాలిటెక్నిక్ కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా 4వ తేదీన అన్ని విద్యా సంస్థలకు బంద్‌కు పిలుపు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలోయూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్య విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 2: పేద ఆర్యవైశ్య విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, బీటెక్, ఇతర తరగతులలో ఉత్తీర్ణులైన ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అమ్మవారిశాలలో దరఖాస్తులు తీసుకుని ఈనెల 15వ తేదీలోపు ఆర్యవైశ్య కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులకు త్వరలో స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు.

వసతి గృహాలను తనిఖీచేసిన అధికారులు

కాశినాయన, జూలై2:నర్సాపురంలోని బీసీ బాలికల,ఎస్సీబాలుర వసతి గృహాలతోపాటు నర్సాపురం మోడల్ పాఠశాల,వరికుంట్ల కస్తూర్బా గాంధీ హాస్టళ్లను మంగళవారం తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి,మండల వైద్యాధికారి ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదులు, మరుగుదొడ్లు మౌలిక వసతులను పరిశీలిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమ వుతున్నందున సీజల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన మధ్యాహ్నభోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు ఖాజావలి పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని బి.కోడూరులో ఉన్న ఎస్సీ హాస్టలును ఎంపీడీవో ఉదయభాస్కర్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టలులో ఉన్న గదులను, విద్యార్థులు పడుకునే పరిసరాలను, వంట సామగ్రిని, టాయిలెట్స్, హాస్టలు పరిసరాలను పరిశీలించారు. వారికి వార్డెన్‌కు తగిన సూచనలు తెలిపారు. పరిశుభ్రంగా ఉన్నచోట వంట వండాలని, విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని ఆయన తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 2: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పద్మశాలీయ కల్యాణ మండపంలో పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు,అఖిల భారత పద్మశాలీయ సంఘం కార్యదర్శి నందం లక్ష్మణ్‌కుమార్, పద్మశాలీయ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నా సాయికృష్ణ, పట్టణాధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు, అభ్యుదయ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు సాదు అశోక్, పొన్నా వెంకటచంద్రబాబు, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, వద్ది బాలుడు, కడప రామిశెట్టి, జింకా సుబ్రహ్మణ్యం, పోలంకి వరదరాజులు, జానపాటి సింగరయ్య, అవ్వారు శ్రీనివాసులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయం హుండీ లెక్కింపు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 2: స్థానిక శివాలయంలో భక్తులు స్వామివారికి హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు. మంగళవారం ఉదయం ఆలయంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ, జువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో కానుకలను లెక్కించారు. మూడునెలల 15 రోజులకు స్వామివారికి 1,50,439 రూపాయలను కానుకల రూపంలో సమర్పించారు. గోశాలలోని హుండీలో రూ.20,897లను కానుకల రూపంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం మధ్యాహ్నం నిర్వహించాల్సిన 15 ఆలయ గదుల వేలం పాటను వాయిదా వేసినట్లు దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌బాలాజీ తెలిపారు.

● **4న స్వామివారి కల్యాణం..:** శివాలయంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. అలాగే శుక్రవారం ఆరుద్ర నక్షత్రం అమావాస్య సందర్భంగా మృత్యుంజయ హోమం, సాయంత్రం భస్మ హారతి నిర్వహిస్తామని భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

బి.కోడూరు, జూలై 2 : విద్యార్థులు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు ఉదయకిరణ్ పేర్కొన్నారు. మంగళవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంపై బి.కోడూరు హైస్కూలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోమలను నివారించాలంటే ప్రతిశుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు వంట చేసే వారు హ్యాండ్‌వాష్ చేసుకోవడం, ఆహార పదార్థాలను శుభ్రంగా కడుక్కుని వంట చేయాలని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, ఆప్తాల్మిక్ ఆఫీసరు హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

అట్లూరు, జూలై 2 : మండలంలోని కామసముద్రం రెవెన్యూ పొలంలో సర్వేనెంబరు 147లో 40 సెంట్లు భూమి వరదరాజుపల్లె మెయిన్‌రోడ్డుకు ఉండడంతో దాదాపు 50లక్షలు విలువ చేసే భూమి కావడంతో వైసీపీ నాయకుల కన్నుపడింది. వారు సోమవారం స్తంభాలు నాటి ఆక్రమించేందుకు యత్నించగా స్థానికులను అడ్డుకుని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దారు వేణుగోపాల్ స్పందించి ఆక్రమించేందుకు ప్రయత్నించిన భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. వారు వెంటనే సంబంధిత భూమిలో మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నీటి ట్యాంకుల పరిశీలన

ప్రొద్దుటూరు , జూలై: 2 : ప్రొద్దుటూరు పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలు, ప్రైవేటు స్కూళ్లల్లో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో క్వీన్ మేరిస్ పాఠశాలలో నీటి టాంకులను కమిషనర్ పరిశీలించారు.నీటి టాంకు పాచిపట్టి పోవడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఇంజనీర్లు బృందాలకుగా విడిపోయి అన్ని పాఠశాలలు తనిఖీ చేశారు. తనిఖీల్లో అపరిశుభ్రంగా వున్న పాఠశాలలకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలన్నారు. శానిటేషన్ సర్టిఫికెట్లు జారీలో నిబంధనలు పాటించకుంటే మంజూరు చేయవద్దని ఆదేశించారు.

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత

మైదుకూరు, జూలై 2 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం అమ్మపేరుతో మొక్క అనే కార్యక్రమం పిలుపులో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని లింగాలదిన్నెలో పలు రకాల మొక్కలను నాటారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 2: కడపలో పైకప్పు పెచ్చులూడిపడి విద్యార్థులు గాయపడిన ప్రైవేటు హైస్కూలుపై ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రైవేటు టీచర్స్ , లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు విద్యాశాఖాధికారులను కోరారు. ఆ పాఠశాలలో తరగతి గది పైకప్పు కూలి ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించాలన్నారు. ఆ పాఠశాలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అనుమతులు ఉన్నదీ, లేనిదీ, విద్యార్థులకు మంచినీటి వసతి, మరుగుదొడ్లు, భవన నాణ్యతలను పరిశీలించాలని కోరారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యాన్ని శిక్షించాలని కోరారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి

ప్రొద్దుటూరు, జూలై 2 : రాయలసీమ కరువు నివారణ కోసం సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని ప్రజాపక్షం అధ్యక్షుడు న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు అజయ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. రాయలసీమలో మిగులు జలాల మీద ఆధారపడి కట్టిన గాలేరు-నగరి, హంద్రీనీవా తెలుగుగంగా ప్రాజెక్టులకు కృష్ణా జలాలు రావాలంటే సిద్ధేశ్వరం అలుగు ఒక్కటే శరణ్యం అన్నారు. కార్యక్రమంలో ప్రజా పక్షం సభ్యులు పాల్గొన్నారు

మున్సిపల్ షాపురూములకు వేలం పాటలు

ప్రొద్దుటూరు , జూలై 2 : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయవనరులో ఇంటిపన్నుల తర్వాత మున్సిపల్ షాపు రూముల అద్దెలు. కానీ చాలా షాపురూములకు వేలం పాటలు వేస్తే వ్యాపారులు అద్దెకు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో ఎప్పుడూ మున్సిపల్ షాపు రూములు ఖాళీగా వుంటూ ఆదాయానికి గండి పడుతోంది. మంగళవారం మున్సిపల్‌కార్యాలయంలోని కమిషనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌వో చాంబర్‌లో 31 షాపు రూములకు వేలం పాటలకు నోటిఫికేషన్ విడుదల చేస్తే కేవలం రెండు రూములు మాత్రమే వేలం పాటలో పాడుకుని అద్దెలకు తీసుకున్నారు. మిగతా 29 రూములకు వ్యాపారులు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వేలం వాయిదా వేశారు. కాగా బాడుగలకు వ్యాపారులు తీసుకోకుండా కొత్త ఎత్తుగడ వేస్తున్నట్లు మున్సిపాలిటీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

డిగ్రీ ప్రవేశాలకు ఉచిత హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

మైదుకూరు, జూలై 2 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశానికి ఉచిత హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులుంటాయని, విద్యార్థులకు వివిధ గ్రూపులపై అవగాహన కల్పిస్తామన్నారు.

కంపచెట్లు తొలగింపు



పోరుమామిళ్ల, జూలై 2 : పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని రామాయపల్లెకు వెళ్లే దారిలో రోడ్లకిరువైపులా ఉన్న కంపచెట్లన సర్పంచ్ యనమల సుధాకర్ ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లకిరువైపులా కంపచెట్లు ఉండడంతో ఇబ్బందిగా ఉందని ఆ ప్రాంతవాసులు తెలపడంతో స్పందించిన ఆయన కంపచెట్లను తొలగించారు. అలాగే వర్షం కారణంగా గ్రామ పంచాయతీకి వెళ్లే దారిలో నీరు చేరి గుంతగా ఏర్పడింది. ఇటీవల ఇక్కడ ఉన్న ఇటుకబట్టీల వద్ద మట్టిని ట్రాక్టర్లతో తీయించి గుంతలను పూడ్చించారు.

వాహనదారులకు ఇక్కట్లు



వంతెనపై గుంతలు

జమ్మలమడుగు, జూలై 2: జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డులో పెన్నానది వంతెనపై పిల్లర్స్‌కు మధ్య గతంలో ఏర్పాటు చేసిన సిమెంటు, తారు పోయి గుంతలు పడ్డాయి. దీంతో ఆ రోడ్డులో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులైతే అతి కష్టంమీద ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నెరైలు, గుంతలు పడిన పెన్నానది వంతెనపై చర్యలు తీసుకుని గుంతలు పూడ్చి వాహనదారులకు ఇబ్బంది లేకుండా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న చెన్నకేశవరావు

బ్రహ్మంగారిమఠం, జూలై 2 : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల కళాశాలను మంగళవారం పలుగురాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చెన్నకేశవరావు, వైద్య బృందం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని వంట గది, మరుగుదొడ్లు, తాగునీరు, ఓవర్‌ట్యాంకు ఆహార పదార్థాలు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో వైద్యాధికారి చెన్నకేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు జూలై, ఆగష్టు రెండు నెలల్లో జాగ్రత్తగా ఉండాలని, అనుమతి లేనిదే బయటికి వెళ్లకూడదని ఆయన తెలిపారు. అలాగే ఆరోగ్య సమస్యలు ఏమైనా తలెత్తినప్పుడు వైద్యసిబ్బందికి వెంటనే తెలపాలని అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందానికి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్డీయే పథకాల అమలుపై వారోత్సవాలు



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మైదుకూరు, జూలై 2 : ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ల పెంపు పథకాన్ని అమలుపై మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంద కృష్ణమాదిగ బ్యానర్‌కు పాలాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ 6వేలకు, మంచానికే పరిమితమైన వారికి 10 నుంచి 15వేల దాక ఇవ్వడం ఏ రాష్ట్రంలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, కైపు భాస్కర్; ఓబయ్య, మాతయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు తూతూ మంత్రంగా వైద్యసేవలు

సమగ్ర దర్యాప్తు చేయాలి: మాజీ మంత్రి డీఎల్

ఖాజీపేట, జూలై 2: తమ పిల్లలు చదువుకుంటే బాగుపడుతారని తల్లిదండ్రులు కష్టం చేసి అయినా సరే బడులకు పంపుతారు. అందుకు విరుద్ధంగా ఖాజీపేట బాలికోన్నత పాఠశాలలో అయిన వారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో అన్న చందంగా టీచర్లకు మినరల్ వాటర్, విద్యార్థులకు కలుషిత నీరు ఇస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. బాలికోన్నత పాఠశాలలో మూడు రోజులుగా విరేచనాలు, వాంతులు, దగ్గు లాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. అయితే ప్రభుత్వ సిబ్బంది ఇచ్చే మందులకు తగ్గకపోవడంతో ప్రైవేటు వైద్యం కోసం పరుగులు తీస్తున్నారు. తూతూ మంత్రంగా వైద్యం అందడంతో ఇదే అదనుగా ప్రైవేటు డాక్టర్లు ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే విద్యార్థినులు నిజాలు బయటకు చెప్పకండి వైద్యం ఖర్చులు అందిస్తాం అని చెప్పడం చూస్తే అధికారుల పనితీరు ఇట్టే అర్థమవుతోంది. స్కూలు ప్రారంభం కాగానే ట్యాంకులు శుభ్రపరచి మంచినీరు అందించాలి. అక్కడ ట్యాంకులు క్లీన్ చేయకపోగా ట్యాంకులకు మూతలు లేకపోవడంతో కోతులు స్నానాలు చేస్తున్నాయని పలుమార్లు ఉపాధ్యాయులకు చెప్పినా అవి అంతేలే పోతాయి, మీరు క్లాసులకు వెళ్లండి అని హుకుం జారీ చేయడం చూస్తే ఉపాధ్యాయుల పనితీరు ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని పిల్లల తల్లిదండ్రులు కోరారు.

● **సమగ్ర దర్యాప్తు చేయాలి..డీఎల్**

పిల్లలు నీటి కలుషితం వల్ల అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి మంగళవారం బాలికోన్నత పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర విచారణ చేపట్టి సమస్య పరిష్కరించాలని కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. పిల్లలకు మినరల్ వాటర్ అందించేందుకు ఖర్చు తానిస్తానని, మినరల్ వాటర్ ఏజెన్సీకి తెలిపానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీ మోహన్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న డీఎల్

కంటెయినర్ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు

కొండాపురం, జూలై 2: జిల్లా సరిహద్దులోని సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రాత్రి కంటెయినర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చెన్నై నుంచి మహారాష్ట్రకు డైపర్ల లోడుతో వెళుతున్న కంటెయినర్ రాగానే మలుపు వద్దఅదుపుతప్పి బోల్తా పడింది.ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.